క్లుప్తంగా

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళ

కర్నూలు (టౌన్): ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ ఈ వేణుగోపాల్, టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ రవిప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా రాబర్ట్‌కోచ్ జయంతి

కర్నూలు(హాస్పిటల్): క్షయ వ్యాధికి కారణమైన మైకోబ్యాక్టీరియా టూబర్ క్యూలోసిస్‌ను కనుగొన్న శాస్త్రవేత్త డాక్టర్ రాబర్ట్‌కోచ్ జయంతిని సోమవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. సామాజిక కార్యకర్త డోన్‌కు చెందిన పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి పాల్గొన్నారు.

కేఎంసీలో సీనియర్ రెసిడెంట్ నియామకాలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో 82 సీనియర్ రెసిడెంట్ నియామకాలు చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేది ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలకు కర్నూలు వైద్యకళాశాల, కర్నూలు వెబ్‌సైట్ www.kurnoo medicaco efekurnoo .ac.i n వీక్షించాలన్నారు.

ఫిర్యాదులపై స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సమస్యల పట్ల వినియోగదారుల నుంచి ఫోన్లు వస్తే వెంటనే స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్తు

కర్నూలు (అర్బన్) : విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి గగారిన్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక ప్రభుత్వ గిరిజన బాలికల గురుకులంలో మోటివేషన్ తరగతులు నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.శ్రీనివాస కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గగారిన్ మాట్లాడుతూ తరగతులు ప్రారంభమైనప్పటి నుంచి పరీక్షలు జరిగే సమయం వరకు నిత్యం పాఠశాలల్లో బోధించే పాఠాలను చదువుతూ ఉంటే ప్రతి ప్రశ్నకు సులభంగా జవాబులు రాయవచ్చన్నారు. అనంతరం వివిధ అంశాలను విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీగుర్రప్ప, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు యువతికి గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న మేఘన

కర్నూలు (అగ్రికల్చర్): నగరానికి చెందిన ఆర్.మేఘన శైనీ పీజీ రేడియాలజీ విభాగంలో గోల్డ్‌మెడల్ పొందారు. వ్యవసాయ శాఖలో అగ్రానమీ ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న అరుణకుమారి, పశుసంవర్ధకశాఖ డోన్ ఏరియా వెటర్నరీ హాస్పిటల్ ఏడీగా పనిచేస్తున్న డాక్టర్ నాగరాజుల పెద్ద కూతురు అయిన మేఘన నీట్ ద్వారా పీజీలో హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో మూడేళ్ల క్రితం రేడియాలజీ విభాగంలో సీటు సాధించింది. ఈ విభాగంలో 12 మందిలో మేఘన శైనీకి అత్యధిక మార్కులు రావడంతో గోల్డ్ మెడల్ లభించిందని ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఈ నెల 10న ఉస్మానియా మెడికల్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందుకున్నట్లు వారు వెల్లడించారు

కార్తీక శోభితం



దేవనగర్ శివాలయం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



శివుడి చుట్టూ దీపాల వరుస



భరత మాత ఆలయంలో లక్ష బిల్వార్చనలో మహిళా భక్తులు

కర్నూలు కల్చరల్: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని నగరంలోని శైవాలయాల్లో విశేష పూజలు జరిగాయి. తెల్లవారు జామున, సాయంత్రం సంధ్యా సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక స్నానాలను ఆచరించి ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి దీప దర్శనం చేసుకున్నారు. నగరంలోని ఇస్కాన్, చిన్మయ మిషన్, సప్తగిరి కైలాస గిరి ఆలయం, దేవనగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, నెహ్రూనగర్ సాయీశ్వరాలయం, అశోక్‌నగర్, శ్రీరామ్‌నగర్, బుధవార పేట, మాధవ నగర్ శివాలయాలు, వైద్య కళాశాల మైదానం నీలకంఠ స్వామి ఆలయం, ఓల్డ్‌సిటీ నగరేశ్వర స్వామి ఆలయం, లలితా పీఠం, నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని మహాగౌరీ శంకర ఆలయం, రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయం, జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాల్లో కార్తీక మాస పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, బిల్వార్చన చేశారు. ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

అథ్లెటిక్స్‌లో మాజీ మేజిస్ట్రేట్ ప్రతిభ



వెండి, కాంస్య పతకాలు సాధించిన బీటీ అనురాధ

కర్నూలు (టౌన్) : ఈనెల 8 నుంచి 10 వ తేదీ వరకు తిరుపతి పట్టణంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మాజీ సెకండ్ క్లాస్ (ఎక్సైజ్) స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బీటీ అనురాధ పతకాలు సాధించింది. 55 సంవత్సరాల విభాగంలో షాట్‌పుట్, 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, జావిలిన్ త్రో విభాగంలో వెండి పతకం సాధించింది. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారిణిని పలువురు మాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు అభినందనలు తెలియజేశారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించండి



సంక్షేమ క్యాలెండర్ విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): సంక్షేమ పథకాలతో పేదలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించాలని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర క్లస్టర్-2 అధ్యక్షుడు కేదార్ నాథ్ ప్రజలను కోరారు. సోమవారం స్థానిక బుధవారపేటలో జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం పథకాల అమలులో పారదర్శకత ఉండేది కాదన్నారు. ప్రస్తుతం అర్హులందరికీ న్యాయం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఆసీఫ్, షౌకత్ అలీ, అక్బర్ అలీ, మోహన్, చందు, గరీబా పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(అర్బన్): జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు యల్లప్ప కోరారు. విభిన్న ప్రతిభావంతులకు సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, హక్కుల సాధనకు నాలుగు రోజుల క్రితం చేపట్టిన పోరుబాట సోమవారం కర్నూలుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట జరిగిన కార్యక్రమంలో యల్లప్ప మాట్లాడుతూ అర్హత ఉన్న వారందరికీ ఆధార్, రేషన్ కార్డుతో నిమిత్తం లేకుండా మోటర్ బైక్, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. వికలాంగుల సంక్షేమ సంఘం, వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఆదర్శ వికలాంగుల ఐక్యసంఘాలు, అమ్మ దివ్యాంగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నేత బీటీ నాయుడు, ఆయా సంఘాల నాయకులు ఆల్ఫ్రెడ్ రాజు, మద్దిలేటి, మాధవేని, భాగ్యలక్ష్మి, ప్రకాష్, ఈరన్న, వెంకటేశ్వర్లు, రాజు, తాయన్న,ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక నాయకురాలు పట్నంరాజేశ్వరి పాల్గొన్నారు.

అవీ-ఇవీ

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ నెల 18వ తేదీన సమ్మె చేయనున్నట్లు వారు సోమవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్యకు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా నాయకులు విజయ్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నాగార్జునమ్మ, ఈశ్వరిబాయి, కాంతమ్మ ఉన్నారు.

జీఓ 17ని రద్దు చేయాలని ధర్నా

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికులకు శాపంగా మారిన జీఓ నంబర్ 17ని రద్దు చేయాలని ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నాకు దిగారు. ఆయన మాట్లాడుతూ..దారి మళ్లించిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులు రూ.450 కోట్లను తిరిగి జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డీసీ రెహమాన్, నగర కార్యదర్శి నల్లన్న పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో సీ.క్యాప్ సెక్షన్‌లో మంగళవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు-2 ఏడీఈ రాజేంద్ర బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీడీ కార్మికుల కాలనీ, కళావతి నగర్, బీటీఆర్ నగర్, వాసవీ నగర్, అరుంధతి నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య భారతి జయంతి

కర్నూలు కల్చరల్: బి.తాండ్రపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో సోమవారం సుబ్రహ్మణ్య భారతి 141వ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.వసుందరా దేవి, అధ్యాపకులు సుబ్రహ్మణ్య భారతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతీయ భాషా మహోత్సవాల్లో భాగంగా 'నా మాతృ భాషలో నా చేవ్రాలు' కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థులు మాతృభాషలో చేవ్రాలు చేశారు.

నగరంలో రెండు రోజులు నీటి సరఫరా బంద్

కర్నూలు (టౌన్) : సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి అశోక్ నగర్ ఫిల్టర్ బెడ్‌కు నీటిని సరఫరా చేసే 1200 ఎంఎం డయా పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషన్ భార్గవ్‌తేజ సోమవారం ప్రకటనలో తెలిపారు. దీని వల్ల ఈనెల 14 వ తేదీ 15 వ తేదీ రెండు రోజులు నగరంలో మంచినీటి సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు.

న్యాయవాదుల నిరసన

కర్నూలు (లీగల్): ఏపీ భూ హక్కుల చట్టం- 2022 జీఓ 512ను వెంటనే రద్దు చేయాలని జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు నగరంలోని శ్రీకృష్ణదేవరాయ విగ్రహం దగ్గర రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. మొదటి రోజు దీక్ష శిబిరంలో న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి సీనియర్ న్యాయవాది బాబు సాహెబ్, ఆర్.నరసింహులు, శ్రీనివాసులు, సోమశేఖర్ గౌడ్, ఎం.వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రవికుమార్, ఆసిఫ్ హుసేన్, న్యాయవాదులు పాల్గొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణం నాయుడు, చక్రపాణి, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ రవి గువేరా, సీనియర్ పాల్గొన్నారు.

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్లు మండలం హుసేనాపురం సమీపంలోని ఇటుకల బట్టీలో ఉన్న నీటి తొట్టి గోడకూలి మరణించిన కార్మికుల కుటుంబాలకుకి రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో చనిపోయిన హైదరాబాద్‌కు సమీపంలోని బాలానగర్‌కు చెందిన సునీత, నందిని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చికెన్ వేస్టేజ్ టెండర్లు రద్దు చేయాలి

కర్నూలు (టౌన్): నగరంలో చికెన్ వ్యాపారులకు ఇబ్బందికరంగా మారిన చికెన్ వేస్టేజీ టెండర్లను రద్దు చేయాలని సీపీఐ నాయకుడు రామక్రిష్ణ రెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం నగరపాలక సంస్థ ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో చికెన్ వ్యాపారులు ధర్నా నిర్వహించారు.

బీఎస్ శాస్త్రి పురస్కారం

కర్నూలు కల్చరల్: వేద సంస్కృతి పరిషత్, మూసీ మాస పత్రిక సంయుక్తంగా ప్రదానం చేసిన బీఎస్ శాస్త్రి పురస్కారాన్ని జిల్లాకు చెందిన ప్రముఖ పరిశోధకులు, సాహితీ వేత్త వైద్యం వేంకటేశ్వరాచార్యులు అందుకున్నారు. 91వ జయంతిని పురస్కరించుకొని ప్రదానం చేసిన ఈ పురస్కారాన్ని ఆదివారం రాత్రి వైద్యం అందుకున్నారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ గేట్ సమీపంలోని సుర భారతి హాల్‌లో జరిగిన పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ ఎన్.ముక్తేశ్వరరావు, విశ్వవిద్యాలయం పూర్వ ప్రాచార్యులు డాక్టర్ శ్రీరంగాచార్య, చరిత్ర పరిశోధకులు డి.సూర్యకుమార్ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో కర్నూలు చాంపియన్

కర్నూలు (టౌన్): ఈనెల 8 నుంచి 10 వరకు తిరుపతి పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. ఈ విషయాన్ని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, కార్యదర్శి వై. రవికుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన మాస్టర్ అథ్లెట్లు 36 బంగారు, 51 రజత, 26 కాంస్య పతకాలు కలిపి మొత్తం 113 పతకాలు సాధించినట్లు తెలిపారు.

కుల దురహంకార హత్యలు పట్టవా?

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో దళితులపై జరుగుతున్న కులదురహంకార దాడులు, హత్యల నివారణ చర్యలు అధికారులకు పట్టవా అని కేవీపీఎస్‌జిల్లా ప్రధానకార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు ప్రశ్నించారు. కుల దురహంకార దాడికి గురై ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మేఘన సోమవారం మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆ సమితి జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5వ తేదీన మేఘనపై కట్టుకున్న భర్త హరికృష్ణ, ఆయన తల్లిదండ్రులు దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావంతో ఆసుపత్రిలో చేరిందన్నారు. కోలుకోలేక సోమవారం మృతి చెందిందన్నారు. అయితే, ఆమెను జిల్లా కలెక్టర్‌గాని, ఎస్పీగాని, చివరకు సాంఘిక సంక్షేమ శాఖాధికారులు గాని పరామర్శించి మెరుగైన వైద్యం అందించలేదన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



మేఘన (ఫైల్)

కర్నూలు: భర్త హరికృష్ణతో పాటు అతని కుటుంబ సభ్యుల దాడిలో గాయపడిన వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన సంజీవరావు కూతురు మేఘన (23) ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతిచెందింది. హరికృష్ణ స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన మేఘన ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో నర్సుగా పనిచేస్తోంది. వీరిద్దరూ ప్రేమించుకుని మూడు నెలల క్రితం పెళ్లి చేసుకున్నారు. వడ్డె కులానికి చెందిన హరికృష్ణ దళిత యువతి మేఘనను పెళ్లి చేసుకోవడంతో కుటుంబ సభ్యులు వ్యతిరేకించారు. అయినప్పటికీ కొంతకాలం ఆ దంపతులు కలసి ఉన్నారు. తర్వాత వారి మధ్య మనస్పర్ధలు ఏర్పడి ఈనెల 5వ తేదీన భర్తతో పాటు ఆమె అత్త సుంకమ్మ, మామ వెంకటేశ్వర్లు కలిసి తలపై రాడ్డుతో కొట్టి గాయపరిచారు. కోమాలోకి వెళ్లిన మేఘన ప్రభుత్వాసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. మొదట హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదు చేసిన కేసును నాలుగో పట్టణ పోలీసులు హత్య కేసుగా మార్పు చేసి (అల్టర్) దర్యాప్తు చేస్తున్నారు. మేఘన మృతికి నిరసనగా ఆమె బంధువులతో పాటు దళిత సంఘాలు కాలనీలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు.

ప్రతి విభాగంలో స్కిల్ ల్యాబ్ ఏర్పాటు

- ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ తనిఖీలో అకడమిక్ డీఎంఈ రఘునందన్



మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రతి విభాగంలో స్కిల్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నామని, ఈ మేరకు ప్రతిపాదనలు పంపాలని అకడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్ చెప్పారు. సోమవారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు మెడికల్ కాలేజీలోని పలు విభాగాలను, నూతన డయాగ్నోస్టిక్ బ్లాక్, రిజిస్ట్రేషన్ కౌంటర్‌లను తనిఖీ చేశారు. ఈ-హాస్పిటల్ అమలు, ఐపీ, ఓపీ కేంద్రాలను పరిశీలించారు. ఏపీలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ-హాస్పిటల్ అమలు 90 శాతం జరుగుతోందని చెప్పారు. ఆసుపత్రిలోని జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాల్లో ఎలాంటి సేవలు అందిస్తున్నారని ఆరా తీశారు.

అవసరమైన వసతులకు ప్రతిపాదనలు పంపండి

పీజీ సీట్లు పెరిగిన దృష్ట్యా త్వరలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ తనిఖీలకు రానుందని అకడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్ తెలిపారు. హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. అవసరమైన వసతులు, సౌకర్యాలపై ఆయా విభాగాల హెచ్‌వోడీలు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. వైద్యకళాశాలలో నాన్ క్లినికల్ డిపార్ట్‌మెంట్‌లలో కొత్తగా ట్యూటర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సి. ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రేణుకాదేవి, డాక్టర్లు హరిచరణ్, సాయిసుధీర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): పిల్లలు ఎవరూ కూడా పోషకాహార లోపంతో ఉండరాదన్నది ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యమని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత అన్నారు. సోమవారం ఆమె కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ మక్బూల్, సీహెచ్‌వో నాగమణి, సరస్వతి, ప్రాజెక్టనిస్టు ఖలీల్, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): ఆడుదాం -ఆంధ్ర క్రీడల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్నకు వివరించారు. సోమవారం ఆయన విజయవాడ నుంచి ఆడుదాం-ఆంధ్రపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని పరిస్థితులను పీఎస్‌కు వివరిస్తూ...సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నిర్వాహక కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్రీడల నిర్వహణపై ఎంపీడీఓలతో సమన్వయం చేసుకుంటూ పీఈటీ, పీడీల ద్వారా వలంటీర్లకు క్రీడా శిక్షణపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. క్రీడల నిర్వహణకు సంబంధించిన అన్ని మైదానాల వివరాలను అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. సచివాలయ స్థాయి, మండల స్థాయి స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,33,736 మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఆమె వివరించారు.







